# ప్రస్థానం

ఢిల్లీ నుంచి వంటరిగా ప్రయాణం చేయడం అర్చనకు అది మొదటిసారి. భయం లేదు. కానీ, యిరవై ఏడు గంటల కాలం ఏ పనీ చేయకుండా ఎలా వుండడం అనేది ప్రశ్న. పుస్తకాలూ, పత్రికలు, తిండి, నిద్ర ప్రధానంగా పెట్టుకుంటుంది. కానీ, యింకా సమయం వృధా చేస్తున్నట్లే బాధ. కంపార్టుమెంట్‌లోకి ఒకొక్కరు పదేసి సామాన్లతో ఎక్కుతున్న కొద్దీ యిబ్బందిగా ముఖం పెట్టుకుని చూస్తోంది. తను తెలివిగా, ముందుగానే బెర్తు అడుగుకి తన సూట్‌కేస్ భద్రంగా తోసేసినందుకు సంతోషపడింది. తనతో ప్రయాణించే వారెవరా అని పరకాయించి చూడసాగింది. ఒకరోజు మొత్తం కలిసి జీవించినట్లే కదా! ఏడిచి, బండగా మారాం పెట్టే, మురికిగా వుండే చిన్న పిల్లలు, ఖంగుమని దగ్గుతూ నిద్ర పాడు చేసే పెద్దలు వుంటే అర్చనకు యిష్టం వుండదు. మరీ సరసాలలో మునిగి పోతుండే దంపతులు, సిగరెట్లు వూదుతూ వాతావరణ కాలుష్యం సృష్టించే మగవారు, గురకపెట్టే స్థూలకాయులూ యిష్టం వుండరు. బతుకంతా వారితో కలిపి ప్రయాణించాలన్నట్లుగా చీకాకు పెంచుకుంటుంది.

ఉత్తర దేశస్థులు – ఒక పొడూ (అంటే చాలా పొడుగు) గాటి ఆయన, అంతకు కొంచెం తక్కువ పొడవున్నట్లు కన్పించే నిరక్షరాస్యులు (విద్యాశోభలేదు ముఖంలో) అతని భార్య, పేచీలకే పేచీదారుగా కనపడే ఐదారేళ్ల అబ్బాయి ఒకవేపు కనుపించారు. ఐదు గిన్నెల బృహత్కారియరు వారి తిండి పుష్టిని తెలియచేస్తోంది. ఎదురు బెంచీ మీద నలుగురు పెద్దమనుషులు, గుబురు మీసంతో, మరింత గుబురుగడ్డం, తీక్షణమైన కళ్లు వగైరా అవాంఛనీయ లక్షణాలతో కూర్చుని వున్నారు. మధ్యన పెద్ద బెడ్డింగులు, బుట్టలు, కొత్తగా కొన్న స్టీలు కుర్చీలు. అర్చన మనసులో గుబులు.. ఎలా యిటువంటి వాతావరణంలో ప్రయాణించడం అని. రైలు కదిలింది. పొడుగాటి తల్లి కారియరు విప్పింది. మసాలాది సువాసనలు,కారిపోవడానికి ఆయత్తమైన ద్రవపదార్థాలు, దొంతరలుగా రొట్టెలు, ఆ చిన్నవాడి చేతిలో పట్టనంత లడ్డూలు... మరీ అంత తేరిపార ఆకలి చూపులు చూస్తున్నట్లుంటే బాగుండదని అర్చన ముఖం తిప్పుకొంది. ఖచ్చితంగా ఒక గంట సేపు అల్పాహార కార్యక్రమం సాగింది. ఆకలి రుచి ఎరుగును అని నిరూపించి, నిద్ర కూడా సుఖమెరుగును అన్నట్లు ఆ యిల్లాలు పొడుగాటి పైజమా కాళ్లతో, పై బెర్తు ఎక్కేసి పడుకుంది. అప్పటికి ఆమె పేరు 'ఊర్మిళ' అయ్యుంటుందని అర్చనకు అనుమానం రాలేదు. ఆ తర్వాత గడిచిన సుదీర్ఘమైన గంటల కాలంలో తెలిసింది.

పాపం, పిచ్చిది, యిన్ని వంటలు చేసి, చేసి, ఆకతాయి పిల్లాడిని సంబాళించి, యింటెడు చాకిరితో సతమతమై అలిసి వుంటుంది. ఇదే అదను, ఆమెకు హాయిగా కాళ్ళు చాచుకొని పడుకోవడానికి – అని

అర్చన సరిపెట్టుకునేదే. కాని యింతలోనే ఆ బాల రాక్షసుడు పై బెర్తుకు ఎక్కాలని ప్రయత్నాలు, యింకా లడ్డూలు కావాలని ఏడుపులు, నీళ్లు తీసి వలకపోస్తున్న గలీజు పనులు చూసి – ఆ తల్లి మీద మహా కోపం వచ్చింది. తండ్రి మునీశ్వరుడు, శాంతమూర్తి. లోకుల మీదకు వదిలేశాడు ఆ కోతి గాడిని. అర్చన ఒకటి రెండు సార్లు గుడ్లెర్ర చేసి వాడి వంక చూస్తే వూరుకొన్నాడు. కానీ కాస్సేపటిలోనే బెదరడం మానేశాడు.

ఆ సంసారం చేసిన మహా భోజనం కళ్ళారా చూసిన ప్రభావం వల్ల కాబోలు అర్చనకు తిండి మీద మనస్సు కలిగింది. పెద్దమ్మ కట్టి యిచ్చిన పులిహోర, పెరుగన్నం గబగబా తినేసింది. బయట చీకటిగా లోకం. మిణుకుమనే నక్షత్రాలు గానీ, రైలు వెంటే ఎగిరి వస్తున్నట్లున్న మిణుగురులు కానీ, ఎక్కువసేపు కనబడకుండా, శరవేగాన వెనక్కి పోతున్న దీపాలున్న వూళ్ళు. గాలి బాగుంది. పొట్టలో సరుకు పడినందుకు మనస్సూ బాగుంది. రైలు వేగం "అహెూ! భారతీయ రైల్వే వారూ!" అని మెచ్చుకోవడానికి అర్హముగా వుంది.

సైడు బెర్తులోని తన తోటి ప్రయాణీకుడు మిత్రులతో కాలక్షేపం చేసి, చివరికి వచ్చి తన భాగం సీటు మీద ఒక ప్రక్కకు తిరిగి కూర్చున్నాడు. అర్చన లాంటి యువతి ఎదురుగా కాళ్లు తగిలిస్తూ కూర్చోవడం బాగుండదు అనుకునే సంస్కారం వుందన్నమాట.

బయటకు చూసి, చూసి, ఏవేవో ఆలోచించి, చించి, విసుగు వలన వచ్చిన ఒక ఆవలింత ఆవలించబోయే సమయంలో "బెహన్‌జీ" అని పిలుపు వినబడింది. రెండు సార్లు పిలిచాక తననే అని గ్రహించి – ప్రక్కన బెర్తులోని గుబురు మీసాలలోంచి ఆ ధ్వని వచ్చింది అని గ్రహించింది.

ఏమిటన్నట్లు చూడగానే, అతను సాక్షాత్తూ హిందీ సినిమాల్లోంచి వూడిపడ్డ భయ్యాలాగా హిందీలోనే "మీరు యీ పైన పడుకుని నిద్రపోతారా" అని అడిగాడు. అది చాలా ఆకర్షణీయమైన ఆలోచనగా వినబడింది. ఎవరితో ప్రమేయం లేకుండా పైన పడుకొంటే, పూర్తి విశ్రాంతి దొరుకుతుంది. సామానులు సర్దుకొని పై బెర్తు మీదకు ఎక్కేసింది.

రైలు చప్పుడు లోని లయను ఒక పద్ధతిలో ఆదితాళంలోకి యిరికించాలన్న ప్రయత్నంలో పడింది అర్చన. తనను పై బెర్తు మీదకు సాదరంగా ఎందుకు పంపారో, మరో అరగంటలో అర్థమైంది అర్చనకు. సైడున వున్న పై బెర్తు మీద కూచొని పేకలు కలిపి ఆడడం ఆరంభించారు యిద్దరు మిత్రులు. అర్చన కుటుంబం, చదివిన చదువులు, పెరిగిన వాతావరణాన్ని బట్టి, సప్త వ్యసనాలలో ఏది ఎదురైనా సంకోచించుకుని పోతుంది అర్చన. పిహెచ్.డి.లో సీటు స్వయం ప్రతిభతో సంపాదించుకొన్న సునిశిత బుద్ధి అన్ని విషయాల్లోనూ సకాలంలో పని చేస్తుంటుంది. పేకాట తప్పు. బహిరంగ స్థలమైన రైల్వే కంపార్ట్‌మెంటులో మరీ తప్పు అని అర్చనకు భావం కలిగింది. వాళ్ల వంక కాస్సేపు చూసింది. వాళ్లు చాలా ఉత్సాహంగా, బిగ్గరగా నవ్వుతూ, వారికి వారే ఉషారు పడిపోతూ ఆట సాగిస్తున్నారు.

బుర్రను చల్లబరుచుకొని, నాకెందుకులే గొడవ అని చెవుల పైన దుప్పటి కప్పేసి, నిద్రలోకి వెళ్లిపోవాలని యత్నం చేసింది. ఆ ప్రయత్నం సఫలమైంది. ఎంతవరకు? రాత్రి పొద్దుపోతూ, అందరూ భోజన కార్యక్రమం ముగించుకొని, నిరంతర ప్రవాహంలా, అటూ యిటూ జనం తిరిగి ఆగిపోయే వరకూ మూడు గంటల కొకసారి కూడా ఆగని ఆ రైలు, ఆగినప్పుడు ప్లాట్‌ఫారం పైన గోల చికాకు కలిగించి తగ్గేవరకు.

కళ్లు తెరచి, ప్రక్కకు తిరిగి, తన ఎదురుగా వున్న లోయర్ బెర్తువేపు చూసింది అర్చన. బాబోయ్! సీసా, గ్లాసులు, తినుబండారాలు, గడ్డం, మీసాల వారు సేవనం. చప్పుడు లేకుండా, మునులలాగా ఏకాగ్రతతో త్రాగేస్తున్నారు. కొంచెం, కొంచెంగా ఆస్వాదిస్తూ, పప్పులో, పకోడీలో పాడో తింటున్నారు. ఆ రుచిని సమగ్రంగా అనుభవిస్తున్నారు. అర్చన గుండెలో గుభేలుమని భయం. ఏమిటది బాబోయి! భారత దేశంలోని ప్రజా సేవా రథమేనా యిది అని జలదరింత. విభ్రాంతి వగైరా భావాలన్నీ ఆమెలో కలిగాయి.

దీన్ని ఆపేందుకు ఏం చెయ్యాలి? ఎలా చేయాలి? జమా జట్టీల్లాంటి యీ భాషేతర పురుషులతో తను ఏమనాలి? తోచడం లేదు. ఆ మగవారిలో ఒకాయన పైకి తలెత్తి చూశాడు ఎందుకో. తీవ్రంగా తనవేపే చూస్తున్న యువతి అభిప్రాయాలను గుర్తించినట్లుగా, రెండు మూడు నిముషాల్లోనే కాగితం పొట్లాలు, సీసా, గ్లాసులు అన్నీ సర్దేసి, బల్ల కిందకు తోసేశాడు. రెండో అతను కూడా పైకి చూసి సంగతి గ్రహించి, మరోమాట అనకుండా నోట్లో వున్న పదార్థాలు కసికసిగా మింగేసి, తన బెర్తు శుభ్రం చేసుకొన్నాడు.





వాళ్లిద్దరూ లేచి, దుస్తులు సవరించుకొన్నారు. తీరుబాటుగా పక్కకి నడిచి, పేకాట యింకా దీక్షగా కొనసాగిస్తున్న వారి దగ్గరకు వెళ్లి, తమని కోపంగా చూస్తున్న పిల్ల కాకి గురించి చెప్పారు. అందరూ తనవేపు చూశారు. ఐదున్నర అడుగులున్నా.. పిడికెడే గుండె వున్న బేల కంగారు పడింది. నీకెందుకు ఆ తొందర, వాళ్ల గొడవ అనుకుంది.

ఎంతో సేపు వాళ్లందరి వంకా గుడ్లప్పగించి చూస్తోనే వుంది. వాళ్లు పట్టించుకోక వాళ్ల కబుర్లు, పేకాటలో మునిగిపోతున్నారు. రైళ్లు ఉయ్యాళ్లలాగా నడిచే ఏర్పాటు బాగుంది అన్నట్లు అర్చన ఆవేశం తగ్గి నిద్రలోకి పడిపోయింది.

తెల్లారింది. లేచి, రాత్రి చూసిన మనుష్యుల్ని వెలుతురులో చూసి,వళ్లు మండి పోతున్నా ఏమీ చేయలేక, తన పలుదోమూ, అలంకరణ సామాగ్రితో బయలుదేరిండ అర్చన. అక్కడ కంపార్ట్‌మెంటు గోడకి అంటించిన రేకు మీద స్పష్టంగా వ్రాసి వుంది. 'మద్యం సేవించరాదు' అని ఇంగ్లీషులో, చదువే రాని వారికి యీ రాతలు కనబడతాయా అనుకుంది. ఏమిటి చెయ్యడం అని తీవ్రాలోచనతోనే పరధ్యానంగా తన పనులు ముగించుకొని పక్కనున్న బెర్తు కింది సీటులో కూర్చుంది. కాఫీ తాగింది. ఆగిన స్టేషన్‌లో పేపరు కొనుక్కుని చదివింది.

గుప్పున వాసన. తెగించిన ఆ మగ పురుషులు మళ్లా సీసా తీశారు. అదేదో అనంతంగా వున్నట్లుంది. గ్లాసుల్లో పోసుకుని హాయిగా సేవిస్తున్నారు. మతి పోయింది అర్చనకు. పైన బెర్తు మీద తన ఎదురుగా ముందు రాత్రి నుంచి నిద్రిస్తున్న గృహిణి నిద్రపోతూనే వుంది. పేచీల అబ్బాయి, వాళ్ల నాన్న టీ, టిఫిన్లు సేవించి , కోతి కొమ్మచ్చులాట ఆడుకుంటున్నారు. తన ఎదురుగా సీటు మీద పెద్ద మనిషి ఇంగ్లీషు పుస్తకాలు చదివేస్తున్నాడు. మధ్యలో అవసరం కోసం తలుపు దాకా పోయి సిగరెట్టు కాల్చి మొహమాటంగా తిరిగి వచ్చి కూర్చుంటున్నాడు.

అర్చన తీవ్రంగా తన వంక చూస్తుండడాన్ని గమనించి, సీసా, గ్లాసులు తీసి, బెంచి కింద పెట్టేశారు. తన సూట్‌కేసుని ఆనించి, దాన్ని మలినం చేసేస్తూ తోశారు. అర్చన అశాంతిగా లేచి, బ్యాగ్ భుజాన తగిలించుకొని బయలుదేరింది. పాంట్రీ కారు దాటి,అలా నడుస్తోంటే, రెండో డబ్బాలో రైల్వే ఉద్యోగులు కనపడ్డారు. ఐదారుమంది కూర్చొని కాఫీ తాగుతున్నారు. ధైర్యంగా నిలబడి "మా డబ్బాలో మగవాళ్ళు తాగుతున్నారండీ! అది రూల్స్‌కి వ్యతిరేకం కదా!" అన్నది. "ఏం తాగుతున్నారు?" అన్నాడు ఒకాయన.

"నాకు ఆ బ్రాండ్లు, రంగులు తెలియవు గానీ, మంచినీళ్లు కావు. నేను కంప్లైంట్ యివ్వడానికి వచ్చాను" అన్నది అర్చన. అక్కడున్న వారికి యీ మాట ఏమీ చలనం కలిగించలేదు. కానీ అలా కనుపించడం యిష్టం లేక, ఒకాయన లేచి వాష్ బాసిన్ దగ్గర నిలబడ్డ కానిస్టేబుల్, మరో పెద్ద వయస్సు మనిషితో, "అక్కడ ఎవరో ఆల్కహాల్ తీసుకుంటున్నారంట, పోయి చూసిరా" అన్నాడు. అతను మామూలు దుస్తులలోనే వున్నాడు. ముఖం చిట్లించి అర్చన వంక చూసి "ఎక్కడ నడు పోదాం" అన్నాడు.

అర్చన భయంగా రైల్వే అధికారి వంక చూసి, "నేను రాను,నాకు భయం.ఎస్-9లో 65 నెంబరు సీటు నుంచి కూర్చున్నారు' అన్నది.

ఆయన ఒక్క క్షణం ఆలోచించి, "మీరిక్కడే వుండండి, వాళ్లు చూస్తారు" అన్నాడు. వాళ్లు వెళ్లారు. ఐదు నిముషాలలోపే తిరిగి వచ్చారు. "ఆడ ఏమీ లేదు కదా.. మేమేడ తాగుతున్నం? అంటున్నరు. అమ్మా మా నెత్తి మీదకు తీసుకురాకు. ఆళ్లు డిఫెన్స్ స్టాఫ్ అంట" అన్నాడు ఆ పెద్దాయన. కానిస్టేబుల్ కూడా తనకి సాధ్యమైనంత ఎగతాళిగా ముఖం పెట్టాడు.

రైల్వే అధికారి ఏదో విచారణ చేయబోతున్న అధికార స్వరంతో, "ఆ - ఆ డిఫెన్స్ వాళ్లకి ఏర్పాటు వుండిందిలే. ఐనా ఏమి తాగినారో ఏమో... పొండి అమ్మా పోయి కూర్చో. మీ లగేజి అంతా అక్కడే వుందిగా? మీకేమీ భయం లేదు. మిమ్మల్ని ఏమన్నా అన్నారా?" అన్నాడు. అర్చన లేదని తలూపింది. "ఇంక ఎందుకు బాధ పడుతున్నారు? ఇంక అయిపోయే! ఆంధ్ర బార్డరు వచ్చిందంటే అన్నీ బంద్" అన్నాడు. అర్చనకి లోలోపల చాలా కోపం వస్తోంది. "నేను ఫూల్ అనుకుంటున్నారా? రైలులో తాగడం నేరం. ఆడపిల్లల ముందు తాగడం డబుల్ నేరం. మీ అధికారం దేనికి? ఈ రూల్సు ఎందుకు పెట్టారు? మీరు పట్టించుకోకపోతే నేను సికింద్రాబాద్‌లో దిగగానే కంప్లైంట్ చేస్తాను" అన్నది.

వాళ్లంతా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. "ఆడ ఎవరు తాగుతలేరు.. ఏమి లేదంటే అబద్ధం కంప్లైంట్ మేము ఎట్ల తీసుకోవాల?" అన్నాడు పెద్ద వయస్సు మఫ్టీ మనిషి.

"అబద్ధమా, నేను అబద్ధం చెప్పానా? పద చూపిస్తా పదండి. నా వెంటరాకపోతే, దాని మీదా కంప్లైంట్ యిస్తా" అన్నది కంఠం ఎత్తి బిగ్గరగా అర్చన.

కానిస్టబుల్, మఫ్టీ ఆయన యిబ్బందిగా కదిలారు. ప్రయాణీకులు, కేటరింగ్ వాళ్లు అందరూ వింటున్నారు. మరీ బహిరంగ వ్యవహారమైంది. "పదండి" అన్నదామె గట్టిగా.

అందరూ వెళ్లారు ఆ కంపార్టు మెంట్‌లోకి. బెంచీ కింద తన సూట్‌కేసున్న చోటికి వేలితో చూపించింది అర్చన. ఆ నలుగురు ప్రయాణీకులు కంగారు పడిపోసాగారు. వాళ్లు అనుకోని పరిణామం కాబోలు, దాచేందుకు గానీ, బుకాయించేందుకు గానీ వీలులేకుండా జరిగిపోయింది. కానిస్టేబుల్ సీసా బయటికి లాగాడు.

అందరూ వేడుక చూస్తున్నారు. మఫ్టీలోని అధికారి ఆ సీసా తీసుకున్నాడు. తన భాషతో దుర్భాషలో మగాళ్ళిద్దరినీ తిట్టడం ఆరంభించాడు. అర్చన వంక చూస్తున్న వాళ్ళ కళ్లలో నిప్పులు.

"ఏందయ్యింది? ఏంది?" అంటూ ఏదో అడగబోతున్నాడు. దొరికిపోయిన దొంగలు సీసా గుంజుకోవాలని చూశారు. మఫ్టీ ఆయన చేతుల్లోకి సీసా మెరిసి పోతున్న ద్రవం. అర్చన కళ్లు తిప్పుకుంది. కానీ అంతలోనే అటు చూస్తే సీసాలు చేతులు మారుతున్నట్లు భ్రమ కలిగింది.

మెరుపు తీగెలా ముందుకు అడుగేసి, సీసా లాక్కుని, వేగంగా పోతున్న రైలు కిటికీలోంచి బయట పారేసింది. నలుగురు మగవాళ్ళు చేరి అరుపులు. మఫ్టీ ఆయన గొడవ. "ఎందుకు పారేసినవ్' అని. కానిస్టేబుల్ అర్చనకు, మిగతా వాళ్లకీ మధ్య నిలబడి, "అమ్మా పద తల్లీ! నువ్విడనుంచి పద" అంటున్నాడు.

"నేను రాను. యిది తేలాలి. కేసు పెట్టి వీళ్లని జెయిల్లో తోయించాలి" అన్నది వాడిగా చూస్తూ.

"నీకు దణ్ణం పెతాను. పద తల్లీ. మేం చూసుకుంటాం. కేసు సంగతి" అంటున్నాడు ఆ రైల్వే పోలీసు. అర్చన వినలేదు. నేను రానని అక్కడే కూర్చుంది. అందరికీ యిదొక చూడదగిన నాటక దృశ్యం అయింది. ఆ మగవాళ్ళు అరుస్తూనే వున్నారు. తాము అర్చనకి కాపలా వుండి, చెల్లెలాగా చూసుకున్నామన్నారు. ఆ సీసా ఎవరిదో అంటున్నారు. ఎవరో పెట్టారు అంటున్నారు. చొక్కాలేకుండా, గడ్డం మీసాలతో వున్న పెద్ద ఆకారం, "సీసా పారేశావులే" అని అరుస్తున్నాడు హిందీలో.

అర్చన కదలలేదు. వాళ్లు చెప్పి విసిగారు. సీసా పడిపోయిన వేపు దిగులుగా రోషంగా చూస్తున్నారు ఆ మగవాళ్ళు. మఫ్టీ ఆయన, రైలు పోలీసాయన, "మళ్లీ వస్తామమ్మా! భద్రం" అన్నారు వెళ్లారు.

కేసు పెట్టడం లేదు. వాళ్ళందరికీ నవ్వులాటగా వుంది. స్టేషనులో రైలు ఆగింది. అర్చనకి ఎందుకో దాహం వేస్తున్నట్లుంది. తన మంచి నీళ్ల సీసా తీసుకుని దిగింది. పక్క సీటాయన "నేను తెస్తా" అంటుంటే వినిపించుకోలేదు. తుఫాను తర్వాత స్తబ్దులాగా వుంది.

దగ్గరగానే వుంది మంచి నీళ్లపంపు. నీళ్లు పట్టుకుంటూ, లోపల్నించి కోపం ఆవిర్లుగా వస్తోంటే ఆలోచనలోపడబోతున్న అర్చన వెనక్కి తిరిగింది. రైలు మెల్లిగా కదులుతోంది. గుండె ఎగిరిపడగా పరుగెత్తింది.

కంపార్టుమెంటు హాండిల్ పట్టుకోబోతున్నది. తీసి వున్న తలుపు దగ్గర చొక్కాలేని, భారీ మనిషి అడ్డం వున్నాడు. అతను చేయి పట్టుకుని పైకి లాగితే చాలు. రైలు వేగం పుంజుకుంటున్నది. వణికే చేతులు, అయోమయమై తిరిగి పోతున్న కళ్లు...

....."అమ్మా!" మూలిగింది అర్చన. ఎదురుగా అమ్మే! కాలు చేయి కదపలేక పోతున్నది అర్చన. నీరసం. సినిమాలోలాగా ఆస్పత్రి వాతావరణం. "తల్లీ! ఎలా వుందమ్మా... ఏమీ ఫర్వాలేదు. తర్వాత చెప్పవచ్చు" అమ్మ ఓదార్పు.

"నేను... నేను... నాకేమైంది" అన్నది గొంతుకు ఆర్చుకు పోతుంటే... గ్లూకోజ్ నీరు పోసింది ఆ తల్లి. "రైలు ఎక్కబోతూ పడిపోయావమ్మా. దెబ్బలు తగిలాయి"

అర్చన కళ్లు పెద్దవి చేసింది. "అమ్మా.... నువ్వు సోషల్ వర్కర్‌వి. నేను కోపంగా సీసా బయట పడేశాను. వాడు... ఆ సీసా తాగిన వాడు నేను ఎక్కుతుండగా నా చేతి మీద దెబ్బ కొట్టాడు. నాకు భయమేసింది అమ్మా!" అని చెయ్యి కదపబోయి చేతకాక, బాధతో మూలిగింది.

అమ్మ... మద్య నిషేధం ఉద్యమం, సోషల్ వర్కర్ లాగా కాక, అమ్మలాగా జాలిగా చూసింది. కడుపు చెరువై పోతుండగా "భయం లేదమ్మా" అన్నది. కానీ సీసా విసిరిన ఆ చేయిని వాడు తోసి పడేసి విరక్కొట్టాడని, ఆరువారాలైనా అతుక్కో కపోవచ్చుననీ, యిప్పుడే చెప్పి ఏం లాభం?....

**వేదగిరి రాంబాబు 'కొత్తకథ' పుస్తకం**